# పులిచింతలను ఎందుకు వ్యతిరేకిస్తున్నాం?

రైతుల ప్రాణాలు కాపాడాలంటే సాగునీరివ్వాలని అడిగామని చెప్పి రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఎడాపెడా ప్రాజెక్టులకు శంకుస్థాపనలూ, భూమిపూజలూ మొదలు పెట్టింది. 'పెండింగ్' ప్రాజెక్టులుగా పేరుపడిన అన్ని ప్రాజెక్టులూ అయిదేళ్ల లోపల కట్టేస్తానని దబాయిస్తున్నది.

ఉన్న నిధులు పొదుపుగా వెచ్చించి ఎక్కడ ప్రాజెక్టులు ఎక్కువ అవసరమో, ప్రాజెక్టులకు అవకాశం లేని ప్రాంతాలలో సాగునీటి పెంపుదల ఏవిధంగా చేపట్ట వచ్చునో విశ్లేషించి పథకాలు చేపట్టేబదులు, నీటి కేటాయింపులేని ప్రాజెక్టులూ, పర్యావరణ అనుమతి లేని ప్రాజెక్టులూ, పొరుగు రాష్ట్రాలు ససేమిరా అంటున్న ప్రాజెక్టులూ, ప్రజలు వద్దంటున్న ప్రాజెక్టులూ అన్నిటికీ ఇక్కడ వందకోట్లు, అక్కడ అయిదు వందల కోట్లూ కేటాయించి భూమి పూజలు మొదలుపెట్టింది ప్రభుత్వం.

'ప్రజలు వద్దంటున్న' ప్రాజెక్టులలో పులిచింతల ఒకటి. ప్రాజెక్టు వల్ల ముంపుకు గురయ్యే ప్రజలు ప్రాజెక్టును వ్యతిరేకించడం సహజం అని కొట్టిపారేస్తున్నారు. అది సహజమేగానీ దీన్ని కొట్టిపారేసే విషయంగా ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడా భావించడంలేదు. 'దేశం' బాగుపడడానికి కొంతమంది త్యాగం చేయక తప్పదనే వైఖరి ఒకనాడు ప్రాచుర్యం పొంది ఉండింది. కానీ క్రమంగా, 'దేశం' పేరు చెప్పుకున్నా 'సమాజం' పేరు చెప్పుకున్నా బాగుపడేది కొందరు వ్యక్తులేననీ, నష్టపోయేదీ కొందరు వ్యక్తులేననీ, ఇద్దరూ 'దేశం'లో భాగమే కాబట్టి ఒకరి బాగునూ, మరొకరి వినాశనాన్నీ ఒకటిగానే చూడాలనీ అవగాహన పెరిగింది. ప్రాజెక్టు వల్ల నిర్వాసితులయ్యే వారి స్థిరాస్తులకు (ఉంటే) నష్టపరిహారం ఇచ్చేసి చేతులు దులిపేసుకునే వైఖరి చాలావరకు పోయింది. మనకంటే నాగరికమైన దేశాలలో, నిర్వాసితుల పూర్వ జీవన ప్రమాణం ఏమాత్రం దెబ్బతినకుండా ఉండే పద్ధతిలో ప్రాజెక్టు చేపట్టగలిగితేనే చేపడుతున్నారు. నీటి పారుదల ప్రాజెక్టుల విషయంలోనయితే, కొత్తగా వచ్చే ఆయకట్టులోనే నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తున్నారు. మన రాష్ట్రంలో ప్రస్తుతం ప్రపంచ బ్యాంకు నిధులిస్తున్న శ్రీరాంసాగర్ రెండవ దశ ప్రాజెక్టుకూ, శ్రీశైలం కుడిగట్టు కాలవ ప్రాజెక్టుకూ ఈ నియమాన్ని ప్రపంచ బ్యాంకు వర్తింపజేస్తున్నది.

కానీ పులిచింతల వల్ల కొత్త ఆయకట్టేమీ రాదు కాబట్టి ఆ రకమైన పునరావాసం కల్పించడం సాధ్యంకాదు. పులిచింతల కృష్ణా డెల్టాలో ఇప్పటికే సాగవుతున్న 12.5 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించే ప్రాజెక్టు. కానీ దానికోసం నల్లగొండ, గుంటూరు జిల్లాలలో దాదాపు 30 వేల ఎకరాలు మునుగుతాయి. ఏడు గ్రామాలు పూర్తిగా, ఐదు గ్రామాలు పాక్షికంగా మునుగుతాయి. ప్రాజెక్టుకు కొత్త ఆయకట్టు లేదు కాబట్టి ప్రస్తుతం నాగరిక దేశాలు అనుసరిస్తున్న నమూనా ప్రకారం ఈ జనానికి కొత్త ఆయకట్టులో పునరావాసం కల్పించే అవకాశం లేదు. అసలు వారికి ఏ పునరావాసమూ దక్కదు. స్థిరాస్తులున్న వారికి కొంత నష్టపరిహారం దక్కుతుంది. అందులో లాయర్లూ, బ్రోకర్లూ తినగా మిగిలిన దానిలో ఎకరానికి పదిగుంటలు కూడా తిరిగి ఏ ఊరిలోనూ కొనుక్కోలేరు. స్థిరాస్తులు లేని వారికి ఆ మాత్రం కూడ దక్కదు.

### ఆ ప్రజల అభ్యంతరాన్ని 'ఎప్పుడూ ఉండేదే' అని కొట్టిపారేయడం తగునా?

పులిచింతల ప్రాజెక్టు సున్నపురాయి నిక్షేపాలున్న ప్రాంతంలో కడుతున్నారనీ, దాని వల్ల ఆ ఖనిజం వృథా అయిపోతుందనీ తెలంగాణ రాష్ట్ర సమితి లేవదీసిన అభ్యంతరానికి ప్రభుత్వం మరీ విచిత్రమైన జవాబు చెప్తున్నది. ఇప్పుడక్కడ ఉన్న ఖనిజం ప్రస్తుతం తవ్వుతున్న పద్ధతిలో తవ్వితే 2009లో అయిపోతుందనీ, ఇంకా వేగంగా తవ్వి ఇప్పుడే అంతా తీసేసి ప్రాజెక్టు కట్టేస్తామనీ పొన్నాల లక్ష్మయ్యగారు అంటున్నారు. అయిదు సంవత్సరాల నిక్షేపాన్ని అయిదు వారాలలో తవ్వేయడం సాధ్యమేనని అనుకున్నా, దానినంతా ఎక్కడ దాచుకుంటారు? మిర్యాలగూడెం నిండా గోడౌన్లు కట్టి భద్రపరుస్తారా? అక్కడ దొరికే సున్నపురాయిని స్థానిక సిమెంటు ఫ్యాక్టరీలకు ముడిసరుకుగా వాడుకోవడం జరుగుతున్నది. వాటి అవసరం మేరకు తవ్వడం జరుగుతున్నది. అయిదేళ్ల సరుకును ఇప్పటికిప్పుడు తవ్వేసి తీరికగా సిమెంటు ఉత్పత్తికి వాడుకుంటామనడం ఇంగితం ఉన్న వారిచ్చే జవాబేనా?

## ప్రధానమైన అభ్యంతరం

అయితే పులిచింతలను వ్యతిరేకించడానికి ప్రధానమైన అభ్యంతరం నీటి హక్కులకు సంబంధించినది. నిజానికి తొలినాడు ఇదే ప్రధాన అభ్యంతరంగా ఉండింది గానీ ఎవరి కారణాల వల్ల వారు దీని గురించి ఇప్పుడు మాట్లాడడం మానేసారు కాబట్టి కొంచెం వివరంగా చెప్పుకోవడం అవసరం.

'వృథాగా సముద్రంలోకి పోయే నీటిని' పులిచింతలలో బంధించి డెల్టా ఆయకట్టు స్థిరీకరణ కోసం వాడుకుంటున్నామనీ, దానిని వ్యతిరేకించడం కుళ్లుబోతు తనమనీ వాదిస్తున్నారు. ఇది అవాస్తవం. దీనిని అర్థం చేసుకోవడానికి కృష్ణా జలాల వాడకానికి సంబంధించిన వ్యవస్థ గురించి కొంత అవగాహన అవసరం. కోస్తా జిల్లాలకు చెందిన నాయకులకు ఈ అవగాహన ఏ మాత్రం లేకపోవడం వల్ల అక్కడి రైతాంగాన్ని ఊరికే రెచ్చగొట్టడం జరుగుతున్నది.

కృష్ణానది మూడు రాష్ట్రాల ద్వారా ప్రవహించే నది (తెలంగాణ వేరయితే నాలుగవుతుంది). దాని పరీవాహక ప్రాంతంలో వర్షాభావ తీవ్రత అధికం కాబట్టి ఆ నది నీటికి డిమాండు ఎక్కువ. అందువల్ల దాని మీద న్యాయబద్ధంగా హక్కులను రూపొందించుకోవడం, దానికి అందరూ కట్టుబడి ఉండడం అవసరం. దీనికి ప్రస్తుతం అమలులో ఉన్న వ్యవస్థ బచావత్ అవార్డు.

బచావత్ అవార్డు కృష్ణానదీ జలాలలో ఒక హక్కుగా వాడుకోగలిగిన దానిని 'నికర జలాలు' అనీ, తక్కిన దానిని 'మిగులు జలాలు' అనీ వర్గీకరించింది. పులిచింతలలో బంధించబోయేది 'వృథాగా సముద్రంలోకి పోయే నీళ్లు' అంటే అర్థం అది అంతా మిగులు జలమని. అది అబద్ధం. పులిచింతలలో బంధించబోయే 40 లేక 45 టిఎంసిల నీటిలో 9 టిఎంసిలు నికర జలాలు. 9 టిఎంసిలను ఆరుతడి పంటలకు వాడుకుంటే 90 వేల ఎకరాలకు సరిపోతుంది. ఎగువ ప్రాంతంలో ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుండి హంద్రీ-నీవా దాకా ఒక్క చుక్క కూడా నికర జలం కేటాయింపులేని దుర్భిక్ష ప్రాంతాల 'పెండింగ్ ప్రాజెక్టులు' అరడజను దాకా ఉండగా, సుభిక్ష ప్రాంతపు ఆయకట్టును కేవలం స్థిరీకరించే ప్రాజెక్టుకు 9 టిఎంసిల నికర జలం కేటాయింపు చేయడం సబబు కాదన్నది మొదటి అభ్యంతరం.

బచావత్ అవార్డు ప్రకటించే నాటికే ఆంధ్రప్రదేశ్ కృష్ణా నదీ జలాలను పెద్ద మొత్తంలో వాడుకుంటూ ఉండడం వల్ల ఆ అవార్డు మనకు కొత్తగా నికర జలాల కేటాయింపు చేయడానికి ఇష్టపడలేదు. ఒక్క జూరాల ప్రాజెక్టుకు మాత్రమే ఇచ్చింది. అయితే సాగునీటి వ్యవస్థను ఆధునీకరించి నీటిని పొదుపు చేసుకొని, పంట కాలవల నుండి తిరిగి నదిలోకి చేరే 'పునరుత్పత్తి జలాన్ని' దానికి కలుపుకొని మన వాటాలో నుండే మరికొంత నికర జలాన్ని పుట్టించుకునే అవకాశం మనకు ఉండింది. కృష్ణా డెల్టా ఆధునీకరణ ద్వారా 29 టిఎంసిల నికర జలాన్ని ఆదా చేసుకున్నామనీ, కెసి కెనాల్ ఆధునీకరణ ద్వారా 8 టిఎంసిల నికర జలాన్ని ఆదా

చేసుకున్నామనీ చెప్పి, మన రాష్ట్రానికి లభ్యమవుతుందని బచావత్ అవార్డు గుర్తించిన 11 టిఎంసిల 'పునరుత్పత్తి జలాన్ని' దీనికి చేర్చి 48 టిఎంసిల నికర జలాలను అదనంగా మనకిచ్చిన కేటాయింపు నుండే మనం పొందాము. అందులో 19 టిఎంసిలు కర్నూలు (కొంత మేరకు కడప) జిల్లాలలో దుర్భిక్ష ప్రాంతాలకు నీళ్లిచ్చే శ్రీశైలం కుడిగట్టు కాలవ ప్రాజెక్టుకూ, 20 టిఎంసిలు మహబూబ్‌నగర్ జిల్లాలోని కరువు ప్రాంతాలకు నీళ్లిచ్చే భీమా ప్రాజెక్టుకూ కేటాయించి ఆ రెండు ప్రాజెక్టులకూ ఆమోదం పొందాము. పనిలో పనిగా మిగిలిన 9 టిఎంసిలు పులిచింతలకు కేటాయించడం జరిగింది.

ఆ కేటాయింపు సబబా? శ్రీశైలం కుడిగట్టు కాలవతోనూ భీమా ప్రాజెక్టుతోనూ రాయలసీమ, దక్షిణ తెలంగాణ జిల్లాల కరువు తీరిపోదు. ప్రభుత్వాలే గుర్తించి నికర జలాల కేటాయింపు లేకపోయినా పదే పదే పునాది రాళ్లు వేసిన 'పెండింగ్' ప్రాజెక్టులు ఇంకా దండిగా ఉన్నాయి. ఆర్భాటంగా కట్టేసి నీళ్లొచ్చేదీ లేనిదీ తెలియకుండ ఉన్న ఎలిమినేటి మాధవరెడ్డి కాలవ ఉంది. (దానికి తోకగా ఒక వరద కాలవ కూడ ఉంది – వరద కాలవకు వరద కాలవ ఉండడం ప్రపంచంలోనే ఇది తొలి ఉదాహరణ కావచ్చు). ఊసెత్తడమే మానేసిన శ్రీశైలం ఎడమగట్టు కాలవ ఉంది. తెలుగుదేశం పాలనలో జీవో జారీచేసి మహబూబ్‌నగర్ వాసులను ఊరిస్తున్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఉంది. అదే జిల్లాలో ఈ మధ్యనే హామీని పునరుద్ధాటించిన నెట్టెంపాడు ఉంది. తెలుగుదేశం హయాంలో కర్నూలు, అనంతపురం జిల్లాలలో మూడుసార్లు పునాదిరాళ్లు వేసి కాంగ్రెస్ హయాంలో జీవో పొందిన హంద్రీ–నీవా ఉంది. అనంతపురం జిల్లావాసులు ఎప్పటి నుండో అడుగుతూ తెలుగుదేశం హయాంలో జీవో సాధించిన పిఎబిఆర్ ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అటక నుండి తీసి దుమ్ముదులిపి ఇంకొక్కసారి హామీయిచ్చిన గండికోట, వెలుగొండ ప్రాజెక్టులున్నాయి. వీటిలో ఏ ఒక్క దానికి ఆ 9 టిఎంసిలు కేటాయించినా 90 వేల ఎకరాల మేరకు సస్యశ్యామలమవుతుంది. ఈ 'పెండింగ్' ప్రాజెక్టులన్నీ కరువు ప్రాంతాల ప్రాజెక్టులే కాబట్టి ఆ కేటాయింపు ఆ మేరకు ప్రజల జీవన్మరణ సమస్యను పరిష్కరిస్తుంది. అటువంటిది ఆ నీటిని కృష్ణా డెల్టా స్థిరీకరణకు కేటాయించడం ఏం న్యాయం?

అయితే నికర జలం కేటాయింపు వెనక్కి తీసుకున్నట్టయితే పులిచింతల కట్టేసుకోవచ్చునంటున్నామా? అనడం లేదు.

పులిచింతలను స్థిరీకరణ ప్రాజెక్టు అనడమే ఒకరకంగా పొరబాటు. ఒక ప్రాజెక్టు ఆయకట్టుకు రావలసిన నీళ్లు పూర్తిగా రాకపోయినా, సరైన సమయంలో రాకపోయినా దానికోసం చేసే ప్రత్యామ్నాయ ఏర్పాటును ఆయకట్టు స్థిరీకరణ అంటాం. పులిచింతల పైకి చూడగా అటువంటి ఏర్పాటుగానే కనిపిస్తుందిగానీ అది నిజమేనా? కృష్ణా డెల్టా ఆయకట్టుదారులు కొన్ని చారిత్రక – రాజకీయ కారణాల వల్ల ఒకరకమైన నీటివాడకానికి అలవాటుపడ్డారు. చాలాకాలం ఎగువ భాగాన చెప్పుకోదగ్గ ప్రాజెక్టులేవీ లేవు. ఆ తరువాత కర్ణాటకకు బచావత్ అవార్డు ద్వారా హక్కులు పుట్టినా వాడుకోవడంలో చాలా తాత్సారం చేసింది. తెలంగాణ, రాయలసీమ వాసులకు అడిగే హక్కే లేకుండ పోయింది. అందువల్ల తమ కేటాయింపు మించి నీరు పొందడం, అదికూడా వర్షాకాలం తొలిదినాలలోనే పొందడం కృష్ణా డెల్టావాసులకు సాధ్యం అయింది. బచావత్ అవార్డులో కేటాయింపు ఖరీఫ్‌కు మాత్రమే ఉండగా, అంతకంతా రబీ కూడా పండించుకోసాగారు.

ఇప్పుడు ఎగువ ప్రాంతం వారు తమ హక్కుల గురించి స్పృహ పెంచుకునేసరికి ఉద్దరకు వస్తున్న నీళ్లు తగ్గిపోవడమే కాక, తమకు అలవాటయిన సమయానికి ('సకాలంలో') నీళ్లు రావడం కూడా సమస్యాత్మకం అయింది. దీనికి వారు ఎవరినీ నిందించలేరు. కృష్ణా డెల్టాకు కేటాయించినది 181 టిఎంసిలు. అందులో ఆధునీకరణ ద్వారా 29 ఆదా అయ్యాయని అంటున్నారు కాబట్టి 152 టిఎంసిల నీరు వారి హక్కు. అది ఎప్పుడు లభిస్తుందనే విషయంలో నదికి 'టెయిల్ ఎండ్'లో ఉండేవారికి ఇతరులను నిందించే హక్కు ఎక్కడిది?

అనివార్యమైన ఈ మార్పుకు అలవాటుపడడానికి, పంటలలో మార్పులు చేసుకోవడానికి వారికి కొంత సమయం పడుతుంది, నిజమే. అయితే అలవాటయిపోయిందని దాన్ని శాశ్వతంగా భావించి 'స్థిరీకరించాల'నుకోవడం ఎంతవరకు సబబు?

దీనికోసం ఇప్పుడు పులిచింతల కట్టేసుకుంటే, దానిలోకి 45 టిఎంసిల నీరు చేరేమేరకు సాగర్ నుండి దిగువకు నీళ్లు పోవాలన్నది ఒక 'హక్కు' అయి కూర్చుంటుంది. నిజానికి ఆ 'హక్కు' కోసమే కదా పులిచింతల కట్టుకుంటున్నది! రేపు కొత్త కృష్ణా జలాల ట్రిబ్యునల్ ముందుకు ప్రభుత్వం పోయి ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుండి హంద్రీ–నీవా దాకా కరువు ప్రాంతాల ప్రాజెక్టులకు నీటి కేటాయింపు ఏదో ఒక రకంగా సాధించినా, ఆ కేటాయింపులకు పులిచింతల పోటీ అవుతుంది, ఈ 'హక్కు' వాటికి అవరోధం అవుతుంది. ఎందుకంటే సాగర్‌కూ పులిచింతలకూ మధ్య 45 టిఎంసిలు నదిలోకి వచ్చి చేరుతాయనడం కల్ల. అందులో ఎక్కువ భాగం పైనుండే రావలసి ఉంటుంది.

అందువల్లనే ఇప్పుడు ప్రతిపాదించిన చోట కాకుండా దిగువన కట్టుకొని సాగర్‌కు దిగువన కృష్ణానదిలోకి చేరే నీటితో పులిచింతలను నింపుకొమ్మని విమర్శకులు అంటున్నారు. కృష్ణా డెల్టా అవసరాలకు కావలసిన నీరు (అంటే 152 టిఎంసిలు) సాగర్‌కు దిగువనే సగటు సంవత్సరాలలో లభిస్తుందని నిపుణుల అంచనా. ఏ సంవత్సరమైనా అది తక్కువయితే చేయగలిగిందీ లేదు, సాగర్ కట్టమీదుగా అంతకంటె ఎక్కువ పొర్లివస్తే ఆపగలవారూ లేరు. అటువంటి అదనపు నీటిని ఆపుకోవడానికి బెజవాడకు ఎగువన ఇంకొక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కట్టుకుంటామన్నా ఎవరికీ అభ్యంతరం ఉండదు.

ఇప్పుడు ప్రతిపాదించిన చోట కాక ఇంకా దిగువన కడితే ముంపు ఎక్కువ ఉంటుందనీ, 46 గ్రామాలు, 60 వేల ఎకరాల భూమి మునుగుతాయనీ పొన్నాల లక్ష్మయ్యగారు అంటున్నారు.

అట్లాగయితే ప్రాజెక్టు కట్టనేవద్దు మరి.

నల్లగొండ జిల్లాలో నడుస్తున్న బాధాకరమైన ప్రహసనాన్ని గురించి ఇక్కడ చెప్పుకోవాలి. చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, మునుగోడు ప్రాంతాల ఫ్లోరైడ్ సమస్య అందరికీ తెలిసినదే. అదొక భయంకరమైన సమస్య అని అందరూ ఒప్పుకుంటారు. కృష్ణానది నుండి ఆ గ్రామాలకు తాగునీరు ఇవ్వడం దీనికొక పరిష్కారం అని ప్రభుత్వం గుర్తించింది. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నేరుగా నయినా పరోక్షంగానయినా దానికి ఉపయోగపడగలదు. కానీ ఆ ప్రాజెక్టుకు చుక్క నికర జలం కేటాయింపు లేదు.

కాగా, చౌటుప్పల్ ప్రాంతానికి నీళ్లివ్వడం కోసమని చెప్పి వంద సంవత్సరాలకు పైగా మూసీనది పైన ఉన్న చిన్న ఆనకట్టల (కతువాల) వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తున్నారు. 50 వేల ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ వ్యవస్థ మధ్య భాగంలో పిల్లాయిపల్లి దగ్గర పక్కకు కాలవతీసి చౌటుప్పల్‌కు నీళ్లిస్తామంటున్నారు. దానివల్ల తమ పొలాలు ఎండి పోతాయని పిల్లాయిపల్లికి దిగువన ఉన్న కతువాల ఆయకట్టుదార్లు గొడవ చేస్తున్నారు. రెండు కరువు ప్రాంతాల రైతుల మధ్య గొడవ పెట్టి చోద్యం చూసే బదులు ఈ 9 టిఎంసిల నీటిని ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుకు, ప్రత్యేకించి ఫ్లోరైడ్ ప్రాంతాల తాగునీటి అవసరానికి కేటాయించవచ్చుకదా?

**1 నవంబరు, 2004**

నల్లగొండ జిల్లా కమిటీ.

మానవహక్కుల వేదిక

Human Rights Forum